క్లుప్తంగా

ఇసుక కాంట్రాక్టర్‌తో వాగ్వాదం

మణుగూరుటౌన్: కమలాపురం మీదుగా తిరుగుతున్న ఇసుక లారీలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గతంలో లారీలను నిలిపివేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కమలాపురంలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ఇసుక గుత్తేదారు ప్రయత్నించగా, గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. గుంతలు పూడ్చి ఇసుక లారీలు తిప్పుకుంటామంటూ గుత్తేదారు సూచించడంతో అందుకు మరో రహదారి ఏర్పాటు చేసుకోండి గ్రామం మీదుగా వద్దంటూ నిరాకరించారు. దీంతో ఈ గ్రామంలో నుంచి ఎవరూ బయటకు పోవద్దంటూ గుత్తేదారు రోడ్డుకు అడ్డంగా జేసీబీని ఉంచడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రహదారికి అడ్డుగా ఉన్న జేసీబీని తొలిగించారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



మోకాళ్ల మీద నిలబడి నిరసన తెలియజేస్తున్న కార్మికులు, నాయకులు

దుమ్ముగూడెం: మండలంలో విధులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గత మూడు రోజులుగా తమ వేతనాల కోసం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను సీపీఎం నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మికులతో కలిసి మోకాళ్లపై మీద నిలబడి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఖాదర్ బాబు, కాంతారావు, సాయి చందు, శ్రీను, శ్రీకాంత్, పవన్ రెడ్డి, మురళి, కాము, సమ్మయ్య, సాయి కిరణ్, వెంకటేష్, సందీప్, నాగేష్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

గుండాల: వసతి గృహాల్లోని సమస్యను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్, అధ్యక్షుడు షాహెద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మామ కన్ను, గ్రామంలోని ఈఎంఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వరుణ్, పవన్ కల్యాణ్, నాసిర్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు..

దుమ్ముగూడెం: గ్రామ సమస్యలు పరిష్కరించాలని దుమ్ముగూడెం వాసులు ఎంపీడీఓ వివేక్‌రామ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించి, ఇళ్ల మధ్య పాములు, తేళ్లు లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో గడ్డం బాలాజీ, కెల్లా శేఖర్, లంకా శ్రీనివాసరావు, యండి.జానీపాషా పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంఈఓ సున్నం సమ్మయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఈ పోటీల్లో మండలంలోని ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలోని దాదాపుగా 220 మంది బాలికలు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నరసింహారావు, టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షులు కారం సర్వేశ్వరరావు, గౌరారం ప్రధానోపాధ్యాయులు మడకం మోతీరు, పాఠశాల పీడీ బి.హరికృష్ణ, దశమ బాబు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: మాల మహానాడు సంఘం నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టులు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 99ను సవరించి, రోస్టర్ పాయింట్‌ను తగ్గించాలనే డిమాండ్‌తో మాల మహానాడు ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించే ప్రణాళిక ఉంది. సమాచారం అందుకున్న స్థానిక ట్రెయినీ ఎస్సై అఖిల ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు జక్కుల జగదీష్, అల్లాడి రామారావు, గుమ్మళ్ల గోపి, అల్లాడి నాగరాజు, రాచుకోండ చంద్రశేఖర్, మందపాటి చంద్రరావుతోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

యూరియా విక్రయాలు

ములకలపల్లి: పూసుగూడెం జీపీలోని కొమ్ముగూడెం రైతువేదికలో యూరియా విక్రయాలు మొదలయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి వేదికల్లో విక్రయాలు ఆరంభించారు. ఏఈఓ రజనీకాంత్, పీఏసీఎస్ సిబ్బంది కామేశ్, మహేష్ తదితరులు ఉన్నారు.

వాగుల్లో మృత్యుఘోష

- మూడు నెలల్లో నలుగురు మృతి
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు



జూన్‌లో మృతి చెందిన విద్యార్థి



హెచ్చరిక బోర్డు లేని మల్లన్న వాగు చెక్‌డ్యాం

గుండాల: అసలే వర్షాకాలం వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి.. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు.. అయినా ఏజెన్సీలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. వాగు దాటుదామని కొందరు.. సరదాకా ఈత కోసమని ఇంకొందరు.. చేపల వేటలో మరికొందరు ఇలా అర్థాంతరంగా చనువుచాలిస్తున్నారు.. గతంలో వాగులపై బ్రిడ్జీలు లేక దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారుతున్నారు. కానీ ప్రస్తుతం అన్నీ ఉన్నా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి గుండాల మండలంలో మూడు నెలల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఆయా వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పలువురు మృత్యువాత

గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో గడిచిన మూడు నెలల్లోనే నలుగురు మృత్యువాత పడ్డారు. కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన దాన్విత్(10) జూన్ 1వ తేదీన మర్కోడు క్రీడలకు వచ్చిపోతూ ఆళ్లపల్లి మండలం ముత్తాపురం సమీపంలోని కిన్నెరసానిలో ఈత కోసం వెళ్లాడు. నీటిలో మునిగి మృతి చెందాడు. మామకన్ను గ్రామానికి చెందిన ప్రవీన్ ప్రకాష్(25) ఆగస్టు 1వ తేదీన అనంతోగు చెక్ డ్యాం వద్దకు చేపలవేటకు వెళ్లి వలలో చిక్కుకుని మృతి చెందాడు. కొడవటంచ గ్రామానికి చెందిన ఈసం పాపయ్య జూన్ నెలలో కిన్నెరసాని వాగు దాటుతూ యాపలగడ్డ వద్ద నీట మునిగి మృతి చెందాడు. గత రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బానోత్ మోహన్(35) వినయాకుడి నిమజ్జనంలో ఈత కోసం వెళ్లి మల్లన్న వాగులో మునిగి మృతి చెందాడు.

చెక్‌డ్యాంలతో జాగ్రత్త..

మల్లన్న వాగు, కిన్నెరసాని వాగులపై నిర్మించిన చెక్‌డ్యాం ప్రదేశాలలోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు. అయితే చెక్‌డ్యాం పైభాగంలో లోతు ఎక్కువగా.. చాలా దూరం వరకు నీళ్లు నిలువ ఉంటాయి. కింద భాగంలో ఉధృతికి లోతు ఏర్పడి వేగంగా ప్రవహిస్తుంది. ఈ రెండింటితో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరుగుతుంది. ఈత కొట్టేవారు, చేపల వేటకు వెళ్లే వారు లోతును అంచనావేయక మునిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో మల్లన్న వాగు, కిన్నెరసాని వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సామగ్రితో బోధన చేయాలి



గుండాల: టీఎల్ఎం బోధన సామగ్రిని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

అశ్వారావుపేటరూరల్: ఉపాధ్యాయులు 'టీఎల్ఎం మేళా'లో ప్రదర్శించిన సామగ్రితో బోధన చేయాలని, తద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని స్థానిక ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు అన్నారు. సోమవారం అశ్వారావుపేట పట్టణంలోని అటెండర్స్ కాలనీ వద్దగల ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు టీఎల్ఎం మేళా సామగ్రిని ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పి.హరిత, నల్లపు కొండలరావు, వీరేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దమ్మపేట: పాఠ్యాంశాల బోధనలో బోధనాభ్యసన సామగ్రిని వాడటం వల్ల విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలు సులభంగా అర్థం అవుతాయని ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళాను ఎంపీడీఓ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్ఎంలు జగపతయ్య, రామకృష్ణా రెడ్డి, సరళ, ఉషారాణి, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని మండల పరిషత్ పాఠశాలల్లో నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాను స్థానిక ఎంఆర్సీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న అన్ని మండల పరిషత్ పాఠశాలల నుంచి వినూత్నమైన బోధనోపకరణాలు తయారుచేసి ప్రదర్శించినట్లు ఎంఈఓ కాంతారావు తెలిపారు. గెలుపొందిన ఆరు టీంలు జిల్లా స్థాయిలో జరిగే టీఎల్ఎం మేళాకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాందాస్, ఏ.రామకృష్ణ, శ్రీనివాసరావు, ఈసం ముత్తయ్య, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగా రాంబాబు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాతిరామ్, మండల్ నాయకులు వీరన్న, బొజ్జ సురేష్, పి.నారాయణమ్మ, సమ్మక్క, విజయ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఫోటో అప్‌లోడ్ చేసేది లబ్ధిదారులే..



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చేత ఫొటో అప్‌లోడ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలో తాను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని తానే ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేసుకునే విధానంపై ఇందిరమ్మ లబ్ధిదారు గుండ్ల స్రవంతికి పంచాయతీ కార్యదర్శి యాకుబ్ సోమవారం అవగాహన కల్పించారు. బిల్లుల చెల్లింపులో జాప్యాలు లేకుండా ప్రభుత్వం ఈ విధానం తీసుకురావడంతో స్థానికంగా అమలు చేస్తున్నారు.

పినపాక కాంగ్రెస్ అడ్డా

పినపాక: నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం బీఆర్ఎస్ పార్టీ పైన, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పైన ఘాటు వ్యాఖ్యలు చేశారు. జానంపేట పంచాయతీ పరిధిలో గ్రామ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే భూకబ్జాలకు, సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబీకులు లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని, తద్వారే కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి అన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని, పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు దొరకని పరిస్థితుల్లో పార్టీ ఉందని అన్నారు. అనంతరం రూ.15 కోట్లతో మండలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు పేరం వెంకటేశ్వరరావు, కోర్సా ఆనంద్, పోలిశెట్టి హరీష్, కంది సుబ్బారెడ్డి, ఉడుముల లక్ష్మిరెడ్డి, మనోజ్, కోర్సా బాలకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.



జానంపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

ఆర్ఎంపీ క్లినిక్‌ల్లో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు చెందిన ఓ ఇమామ్.. ఒక ఆర్ఎంపీ నిర్వాకంతో ప్రాణాపాయ స్థితిలో మృత్యువుతో పోరాడుతున్న విషయమై 'సాక్షి'లో గత నెల 29న ఆర్ఎంపీ నిర్వాకం, 31న అమ్మో ఆర్ఎంపీలు, ఈనెల 2న నకిలీ ఆర్ఎంపీ దుకాణం బంద్ అనే కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ సోమవారం అశ్వారావుపేటలోని పలు ఆర్ఎంపీ క్లినిక్‌లు, రక్తపరీక్షా కేంద్రాలు, ఫార్మసీలను తనిఖీ చేశారు. ఆర్ఎంపీలు పరిధి, స్థాయికి మించిన వైద్యం చేయరాదని.. ప్రమాదకర ఇంజక్షన్లు చేయరాదని హెచ్చరించారు. లేదంటే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఆర్ఎంపీ నిర్వాకం వల్ల అనారోగ్యం పాలయిన ఇమాం ఎస్‌కె.హసన్ కుటుంబ సభ్యులను కలిసి విచారణ నిర్వహించారు.

ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఇప్పటికే ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు ఆయా పంచాయతీలకు బహిర్గతం చేసిన ఎంపీడీఓలు.. సోమవారం ఆ ముసాయిదా జాబితాపై పలు పార్టీల నాయకులు, ప్రతినిధులతో చర్చించారు. వారు లేవనెత్తిన అభ్యంతరాలు, ఫిర్యాదులను నమోదు చేసుకున్నారు. ఆ వివరాలను డీపీఓకు అందించి, తుదిజాబితాను ఈ నెల 10న ఖరారు చేస్తామని ఎంపీడీఓలు వెల్లడించారు. ఆపై రిజర్వేషన్ల ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



పినపాక: పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ సునీల్ కుమార్



అశ్వారావుపేటరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు



బూర్గంపాడు: రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జమలారెడ్డి

సంక్షిప్త సమాచారం

ఆర్థికాభివృద్ధి సాధించాలి

చండ్రుగొండ: స్వయం సహాయక సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ కోరారు. ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్వయం సహాయక సభ్యుల సమావేశంలో లాయన మాట్లాడారు. కొత్రమేను చేపలు, కౌజుపిట్టల పెంపకం, మునగసాగులపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం బొమ్మా శ్రీనివాసరావు, సీసీ రాజేందర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి తుమ్మల ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ అయిన నేపథ్యంలో.. నల్గొండ జిల్లా తాజా రాజకీయాలపై చర్చించారు. అనంతరం ఆళ్లపల్లి మండలానికి చెందిన పోడు రైతులు, వ్యవసాయ విద్యుత్ సౌకర్యం కల్పించాలని మంత్రి తుమ్మలను కోరారు. స్పందించిన మంత్రి.. పోడు భూముల్లో పామాయిల్ సాగు చేయాలని సూచించి, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షుడు గుర్రం సృజన్ బాబాయ్ గుర్రం జాన్ ఇటీవల మరణించారు. సోమవారం దశదిన కర్మ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరై జాన్ చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఆవుల నర్సింహారావు, వేర్పుల సురేష్, లక్ష్మణ్, అక్కి నర్సింహారావు, యూత్ నాయకులు బోశెట్టి రవి, జక్కం రంజిత్, రామారావు, రామారావు, మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌లో తొలి ప్రజావాణి



ప్రజావాణిలో దరఖాస్తులు అందుకుంటున్న తహసీల్దార్ నరేశ్

మణుగూరుటౌన్: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సమస్యలను సంబంధిత అధికారులకు సిఫార్సు చేసి, పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తహసీల్దార్ నరేశ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ జితేశ్ పాటిల్ ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో తొలిసారి ప్రజావాణి ఏర్పాటు చేయగా.. రహదారులు, వీధిలైట్లు, ఏర్పాటు, దివ్యాంగుల పింఛన్లు తదితర సమస్యలపై దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ఉంటుందని, సోమవారం సెలవుదినం అయితే తర్వాతి రోజు ఉంటుందని తెలిపారు. ప్రజావాణిలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి రాహుల్ రెడ్డి, పీహెచ్‌సీ వైద్యుడు నిశాంత్, పశువైద్యాధికారి సరస్వతి, ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, మండల విద్యాధికారి స్వర్ణలత తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గణేశ్ నిమజ్జనాలు



ఎన్డీఆర్ఎఫ్ బృందంతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి నదిలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఒక పక్క భారీ విగ్రహాలు, మరో పక్క లాంచీ గేర్ బాక్స్‌లో సమస్య తలెత్తడం, ఇంకోపక్క గోదావరి వరద నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో ఆదివారం రాత్రే పూర్తి కావాల్సిన వినాయకుడి నిమజ్జనాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. కాగా ప్రస్తుతానికి ఉన్న విగ్రహాలను మంగళవారం రోజు అర్ధరాత్రికి నిమజ్జనం చేసేందుకు కృషి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ, మంగళవారం నిమజ్జనానికి విగ్రహాలు వస్తే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నిమజ్జన ఘాట్ పరిశీలన

భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనానికి వినాయక ప్రతిమలు వివిధ జిల్లాల నుంచి వస్తుండగా.. భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ సోమవారం నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ఆయా శాఖల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయంతో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామనితెలిపారు. ఈ మేరకు సూచనలు పాటించి, అధికారులకు సహకరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.చైతన్య, ఇరిగేషన్ డీఈఈ మధు, ఏఈ వెంకటేశ్, ఎంవీఐ వెంకట పుల్లయ్య, ఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

దమ్మపేట: మండలంలోని దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.చంద్రకళ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దగొల్లగూడెం గ్రామంలో అక్షరాస్యత ర్యాలీని నిర్వహించి, విద్య పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని కోయనర్సాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి 'అందరూ చదవాలి–అందరూ ఎదగాలి'అనే నినాదాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు గొర్రె రామకృష్ణ, విద్యావంతులు తెల్లం రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, ముర్రం మహేష్,నూప రమేష్, నాగరత్నం, రమాదేవి పాల్గొన్నారు.



దమ్మపేట: అక్షరాస్యత ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



కొమురం భీం విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

కరకగూడెం: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వీరాపురం క్రాస్ రోడ్డులోని కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారు.. సుప్రీంకోర్టులో నడుస్తున్న కేసు విషయంలో లంబాడీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం భట్టుపల్లి నుంచి కరకగూడెం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పర్యటనలోకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలిసి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టులో కేసు వేసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు, మాజీ ఎంపీ సోయం బాపురావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల జేఏసీ నాయకులు, ఆదివాసీ యువత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రాష్ట్రమంతా దృష్టి పెట్టాలి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో రోశిరెడ్డి దంపతులు

బూర్గంపాడు: హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను, నిర్మాణాలను తొలగిస్తున్న విధంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో అక్రమ కట్టడాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను భద్రాచలం రామాలయ ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి కోరారు. సోమవారం రంగనాథ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా సాగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. భద్రాచలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన ఓ భవనం కుప్పకూలిన ఘటనను గుర్తు చేశారు. భద్రాచలం రామాలయ భూముల పరిరక్షణకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రభాత కెరటాలు' పుస్తకావిష్కరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన కవి, రచయిత సిద్దాంతపు ప్రభాకరాచార్యులు రచించిన 'ప్రభాత కెరటాలు'కవితా సంపుటిని ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఏపీ జానపద అకాడమి తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు నందిని సిధ్దారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్నూల్ పూర్వ డీఐజీ ఇక్బాల్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహిత బాలసాహితవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావు, రఘువీరప్రసాద్, బైస దేవదాస్, కన్నడ కవులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమలమందు పిచికారీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పలగుంపు, కొడిశలకుంట గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం దోమలమందు పిచికారీ చేశారు. ప్రతీ ఇంటిని వైద్యసిబ్బంది సందర్శించి పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ కంటైనర్లను తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, పద్మ, మంగ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేడ్కర్ నగర్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఇటీవలే ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన నేపథ్యంలో ఆయనకు సత్కరించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బేతి సోమయ్య, తలారి నాగరాజు, ఇల్లంగి బాలకృష్ణ, మందపాటి రామకృష్ణ, గణేష్, వంశీకృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి

ములకలపల్లి: ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని అఖిలపక్ష ఏఎన్ఎంల సంఘ నాయకులు ఉమా, ప్రియాంక అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక వైద్యాధికారి కృష్ణదీపక్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు, వాక్సినేషన్ల కోసం తమను విధుల్లోకి తీసుకుని, ప్రస్తుతం 14 రకాల ఆన్‌లైన్ యాప్‌లలో అప్‌లోడ్ చేసే పనులు అప్పగిస్తున్నారని అన్నారు. దీనివల్ల పనిభారం పెరుగుతోందనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ యాప్‌ల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎంలు సీత, అనిత, జ్యోతి, సుష్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.